# విద్యాక్రమాన్ని తిరోగమన దిశలో మిధ్యగా మార్చజూస్తున్న బిజెపి పాలకులు

**కృత్రిమ** మేధోపరిజ్ఞాన సాంకేతికత శాస్త్ర, సాంకేతికరంగాలలో ప్రాధాన్యత సంతరించుకున్న యుగంలో నేడు మనమున్నాం. ఈలాంటి పరిస్థితుల నడుమ ఏ ప్రభుత్వమైనా ఈ సవాళ్ళను అందుకోగలిగిన విధంగా చర్యలు చేపట్టాలి. మన శాస్త్ర, సాంకేతిక విద్యను ఆ దిశగా అభివృద్ధి పరచి, పురోగమిస్తున్న శాస్త్ర సాంకేతికతను మన విద్యార్థులు అందుకునే విధంగా వారిని సన్నద్ధం చేయగల్గాలి.

ఆర్ఎస్ఎస్ మరియు దురభిమాన మతతత్వ శక్తుల దార్శనికతతో నడుస్తున్న బిజెపి నాయకత్వంలో పాలన సాగిస్తున్న ఎన్‌డిఏ పాలకులు, మనదేశంలో విద్యావిధాన క్రమాన్ని తిరోగమింపజేసి, దానిని ఓ మిధ్యగా మార్చ జూస్తున్నారు. ఇందుకొరకు వారు నకిలీ శాస్త్ర విజ్ఞానాన్ని, మిధ్యావాదాన్ని ప్రవేశపెడుతున్నారు. "భారతదేశపు ప్రసిద్ధిచెందిన గతం గురించిన విశేషాలనందించటంద్వారా విద్యార్థులు గర్వపడేలా చేయటానికి" అనే పేరిట వారు ఈ చర్యలు చేపడ్తున్నారు. భారతదేశ వ్యాపితంగావున్న 3 వేల సాంకేతిక వృత్తి విద్యాకళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల మెదళ్ళలోకి ఈ భావనలను దట్టించబూనుకుంటున్నారు. "పశ్చిమ దేశాల శాస్త్ర సాంకేతిక రంగాల పురోగమనంలో పడి విద్యార్థులు కొట్టుకొనిపోకుండ" ఈ చర్యలు తోడ్పడతాయని వారు వాదిస్తున్నారు.

ఒకవైపున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆహ్వానించే పేరిట ఎన్‌డిఏ పాలకులు విదేశీ ప్రభుత్వాలతో, బహుళజాతి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అలాగే భారత సార్వభౌమత్వానికి కీలకరంగమైన ఆయుధ విభాగంతో సహా ప్రజాజీవితంలోని అన్ని విభాగాలలోకీ విదేశీ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానిస్తున్నారు. మరోవైపున వారు దూకుడుగా తమ మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాలు చేస్తూ వారి తరహా 'జాతీయతత్వాన్ని' నెలకొల్పాలని భావిస్తున్నారు. ఆవిధంగా వారు సామ్రాజ్యవాదులకు సేవకులుగా వారి ప్రయోజనాలను కాపాడుతున్నారు. అదే సమయంలో భారతదేశంలో 'హిందూ జాతీయవాద రాజ్యాన్ని' వారి తరహాలో స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ నేపథ్యంలో 'ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఏఐసిటిఇ) ద్వారా వారు 'భారతీయ విద్యా సార్' (భారతీయ విద్యా సారం) అనే పుస్తకానికి ఆమోదం పొందారు. భారతీయ విద్యాభవన్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని భారతదేశ వ్యాపితంగా ఏఐసిటిఇ ఆధ్వర్యంలోని వృత్తి, సాంకేతిక కళాశాలలన్నింటిలో రానున్న విద్యాసంవత్సరం నుండి వారి పాఠ్యప్రణాళికలో భాగం చేయటానికి అనుమతి పొందారు.

పాఠ్యప్రణాళికలో భాగంగా ప్రవేశపెట్టనున్న "వేద పరిజ్ఞానానికి" సంబంధించిన ఈ పుస్తకానికి డా॥ శశిబాల సంపాదకత్వం వహించారు. ఈ పుస్తకాన్ని ఓ కమిటీ తనిఖీచేసి, సరిచూసిందని చెబుతున్నారు. కాంతివేగం గురించి ఖచ్చితంగా రుగ్వేదంలో చెప్పబడిందని ఈ పుస్తకంలో పేర్కొన్నారు. అలాగే న్యూటన్ పుట్టుకకు ఎంతో ముందుగానే గురుత్వాకర్షణ గురించి వేదాలు పేర్కొన్నాయని ఈ పుస్తకంలో చెప్పారు. నీటి నుండి ఆక్సిజన్, హైడ్రోజన్‌లను ఉత్పత్తి చేయటానికి, అగస్త్య మహర్షి ఎలక్ట్రాలసిస్ విధానాన్ని కనుగొన్నాడని 'భారతీయ విద్యాసార్' పేర్కొంది. భారతదేశంలో విశేష శాస్త్ర, సాంకేతిక మేధో పరిజ్ఞానం, అంతర్‌దృష్టి కలిగిన పురాతన మహర్షులెందరో వున్నారని ఆ పుస్తకం తెల్పుతోంది. విజ్ఞాన శాస్త్రమనేది ప్రపంచానికి తెలియని కాలంలోనే కనడ్ అనే రుషి "వైశేషిక్ సూత్రా"లలో న్యూటన్ చలన సూత్రాలతో సహా వివిధ రూపాలలోని చలనాలను గురించి చర్చ చేశాడని ఆ పుస్తకంలో రాశారు. అలాగే 5 వేల సం॥లకు పూర్వమే భరద్వాజ రుషి వైమానికశాస్త్రం రచించాడని, విమానాల నిర్మాణం గురించేకాక, నావికా, వైమానిక ఇంధనాలు, పైలెట్‌ల నిర్వహణ వంటి అంశాలన్నింటికీ అధికారయుతమైన పాఠ్యగ్రంథంగా ఈ పుస్తకాన్ని పేర్కొంటున్నారు.

"భారతీయ విజ్ఞాన వ్యవస్థలను తెలుసుకునే హక్కు"లో భాగంగా ఈ పుస్తకాన్ని ప్రవేశపెడుతున్నట్లు 'భారతీయ విద్యాసార్' పుస్తకానికి సంపాదకత్వం వహించిన డా॥శశిబాల పేర్కొన్నారు. ఈ పుస్తకం విద్యార్థులలో "శాస్త్ర బుద్ధ"(శాస్త్రీయ ఆలోచన)ను అలవర్చుతుందని కూడా ఆమె చెప్పారు.

అయితే, విద్యావేత్తలు మాత్రం ఇలాంటి ప్రకటనలను "విపరీతమైన"విగా పేర్కొంటున్నారు. సైన్సు పేరుతో ప్రవేశపెడుతున్న అశాస్త్రీయ పుస్తకాన్ని విద్యార్థుల పాఠ్యప్రణాళిక నుండి ఉపసంహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వేలాదిమంది విద్యార్థులకు అపసవ్యమైన సమాచార బోధన చేయవలసి వస్తుందని వారు తమ భయాందోళనలు సరిగానే వ్యక్తంచేశారు. పైన పేర్కొన్న ఈ పుస్తకాన్ని వృత్తి సాంకేతిక కళాశాలల్లో బోధనకు ప్రవేశపెట్టటమంటే, చరిత్రతో చెలగాటమాడుకునే మతతత్వశక్తుల ప్రయత్నాల కొనసాగింపు మినహా మరోటి కాదని వారు పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలను గందరగోళ పరిచేవిధంగా ఈ పుస్తకం హానిచేస్తుందని వారు భావిస్తున్నారు. విద్యాక్రమం మొత్తాన్ని మిధ్యతో తిరోగమింపజేసే దానితో ఈ చర్యలు సమాన మౌతాయని, బోధన సంబంధ అంశంగా కూడా ఇది పెనువిపత్తు కలగజేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. విద్యావిధానంపట్ల ఈ విధమైన వైఖరి కేవలం మందబుద్ధులను మాత్రమే తయారు చేయగలుగుతుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

ఛాందసవాద వంచనాత్మక హిందూమతతత్వ వాదులను ఎగతాళి చేయటానికి "అన్నీ వేదాలలోనే వున్నాయష" అన్న నానుడిని నేడు దూకుడుగా ముందుకొస్తున్న హిందూమతతత్వవాదులు నిజంచేస్తూ సంపూర్ణగా చరిత్రను నాశనం చేస్తున్నారు. నిజాం కాలంలో హైదరాబాదు సంస్థానంలోనూ, ఫాసిజమ్ కాలంలో యూరప్‌లోనూ జరిగిన విధంగా తమ సంకుచిత రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తున్నారు. దీని కోసం వేదాల పేరుతో, శాస్త్ర విజ్ఞానంలో వాటి ఆధిపత్యంగా చెప్పబడే పేరుతో తప్పుడు ప్రకటనలు వల్లెవేస్తూ వస్తున్నారు. యావత్ దేశాన్ని తిరోగమనం వైపు పడదోసే ప్రమాదకర చర్యలివి. ఈ చర్యలతో భారత సామాజిక వ్యవస్థలో సామరస్యంగా మెలిగే వివిధ విభాగాల ప్రజల మధ్యనున్న సోదర బంధాన్ని వారు నాశనం చేయదలచుకున్నారు.

ఇది కేవలం విద్యావేత్తలకు మాత్రమే పరిమితమైందిగాక, దేశంలో అన్ని దేశభక్తియుత, ప్రజాస్వామికశక్తులు ప్రత్యేకించి ప్రగతిశీల విద్యార్ధి ఉద్యమం – ఇలాంటి వంచనాపూరితమైన, హాస్యాస్పదమైన తిరోగమన చర్యలను, ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. సమాజాన్ని మిధ్యాయుగంలోకి నడిపింపజూస్తున్న బిజెపి ప్రభుత్వాధికారపు గొడుగు క్రిందనున్న ఈ హిందూ మతతత్వశక్తుల ప్రయత్నాలను తిప్పికొట్టాలి.

ooooo